క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఇంటి శ్లాబ్



బాధితులతో మాట్లాడుతున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 22వ వార్డు రాజీవ్‌నగర్‌లో సీతమ్మకు చెందిన ఇల్లు శ్లాబ్ బుధవారం కూలిపోయింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. కూలీలను పిలిపించి శిథిలాలను తొలగించారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

ఆరిలోవ: చినగదిలి ప్రాంతం రామలక్ష్మణపురంలో బుధవారం ఓ వృద్ధాశ్రమం అందుబాటులోకి వచ్చింది. జేజీకేఎస్ వారాహి ఓల్డేజీ హోం పేరుతో ఈ గృహాన్ని ఫిజియోథెరపీ విద్యార్థిని పద్మప్రియ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు పద్మప్రియ మాట్లాడుతూ వయో వృద్ధులకు, నర్సింగ్ అవసరమైన రోగులకు సేవలు అందిస్తామన్నారు. పేదలకు అందుబాటులో ఉండేలా రుసుం నిర్ణయించినట్టు తెలిపారు.

5న బుద్ధ పూర్ణిమ

దాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 5న బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజు వేకువజాము నుంచి పూజలు, సామూహిక, విశేష వ్రతాలు జరపనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో బుద్ద మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి ఇందులో పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

సీతమ్మధార రైతుబజార్‌లో స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు బుధవారం ఈవో కొండబాబు డ్రా తీశారు. ఉదయం 90 మంది రైతులకు సంబంధించి 63 స్టాళ్లను, సాయంత్రం 70 మందికి సంబంధించి 63 స్టాళ్లను కేటాయించి, రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు ఒకసారి రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుతో నిరుద్యోగులకు ఉపాధి

ఎంవీపీ కాలనీ: భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉత్తరాంధ్రలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్ వంటి సంస్థల ప్రైవేటీకరణ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆనందం.. ఆహ్లాదం.. ఆరోగ్యం

- విశేష ఆదరణ పొందుతున్న వీఎంఆర్‌డీఏ పార్కు
- చిన్నారుల నుంచి పెద్దల వరకు సందడి



వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్కు

ఏయూ క్యాంపస్: ఆనందం, ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం ఒకే చోట లభించే ప్రాంతంగా వీఎంఆర్‌డీఏ స్మార్ట్‌సిటీ పార్కు విశేష ఆదరణ పొందుతోంది. బీచ్ రోడ్డులో విశాల ప్రాంగణంలో ఉన్న ఈ పార్కు నగరవాసులకు సేదతీరే వేదికగా నిలుస్తోంది. పార్కు ప్రవేశ ద్వారం నుంచి విభిన్న జాతుల మొక్కలతో సందర్శకులకు స్వాగతం పలుకుతోంది. పచ్చని లాన్‌లు మధ్యలో నడకదారులు ప్రకృతి రమణీయతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. దేశీయ జాతులతో పాటు విదేశీ జాతుల మొక్కలు, పుష్పాలు ఆకట్టుకుంటున్నాయి.

చిన్నారులకు ప్రత్యేక ఆట స్థలాలు



చిన్నారులకు ఆనందాన్నిచ్చే ఆట స్థలం

పార్కు ప్రాంగణంలో చిన్నారులు ఆడుకోవడానికి ప్రత్యేకంగా రెండు ఆట స్థలాలు కూడా ఉన్నాయి. పది సంవత్సరాల లోపు వయస్సు వారికి ఉయ్యాల, జారుడుబల్ల వంటి ఆట వస్తువులతో ఒక ప్రత్యేక ప్రాంగణం ఉంది. పది సంత్సరాల పైబడిన చిన్నారులు ఆడుకోవడానికి వీలుగా బాస్కెట్‌బాల్, టెన్నిస్, షటిల్ కోర్టులు సైతం పార్కులో అందుబాటులో ఉన్నాయి. చిన్నారులకు కాస్త శారీరక వ్యాయామానికి ఈ రెండు ప్రాంగణాలు ఉపయోగపడుతున్నాయి.

లాహిరి.. లాహిరి

పార్కులో ఉన్న విశాలమైన బోటింగ్ ప్రాంగణం కుటుంబ సమేతంగా ఆనందంగా గడపడానికి దోహదపడుతోంది. ఇక్కడున్న పదుల సంఖ్యలో బోట్లలో చిన్నారులు, పెద్దలు కాసేపు కొలనులో విహరించే అవకాశం ఉంది.



బోటింగ్ ప్రాంగణం

నిర్వహణపై దృష్టి అవసరం

పార్కుకు నిత్యం పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. దీంతో నిర్వహణపై కాస్త దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. పార్కులో పాడైపోయిన చెస్, లూడో బోర్డులను పునరుద్ధరించడం, వివిధ బొమ్మలకు రంగులు వేసి మరింత ఆహ్లాదరకంగా తీర్చిదిద్దాలి. ఎప్పటికప్పుడు వ్యర్థాలు, ఎండిన ఆకులు తొలగింపు, ప్లాస్టిక్ కవర్లను ఏరివేతకు అదనపు సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. పార్కులో శునకాల సంచారాన్ని నియంత్రించాలి. చిన్నపాటి సమస్యల పరిష్కారానికి వీఎంఆర్‌డీఏ అధికారులు కృషి చేయాలని సందర్శకులు కోరుతున్నారు.



పాడైపోయిన చెస్ బోర్డ్

ఉక్కు ప్రైవేటీకరణపై వామపక్షాల నిరసన

మద్దిలపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా వామపక్ష నాయకులు మద్దిలపాలెం జాతీయ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరంకుశ వైఖరిపై నినాదాలు చేశారు. దీంతో పోలీసులు నిరసన కారులను అదుపులోకి తీసుకున్నారు. రాస్తారోకోలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఆర్కేఎస్వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ మాట్లాడుతూ విశాఖకు ఊపిరి అయిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రధాని మోదీ అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. బ్లాస్టర్ ఫర్నేస్ మూశారని చెప్పారు. వర్కింగ్ క్యాపిటల్, సొంత గనులు కేటాయించకుండా కావాలనే నష్టాల ఊబిలోకి నెడుతున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించే స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వద్ద రాస్తారోకో నిర్వహించి నిరసన తెలుపుతున్న సుమారు 25 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



నిరసన కారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హెచ్‌బీ కాలనీలో సత్యసాయి చలివేంద్రం



హెచ్‌బీ కాలనీలో మంచినీరు పంపిణీ చేస్తున్న సత్యసాయి సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో సత్యసాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని బుధవారం స్థానిక భజన మండలి కన్వీనర్ ఎం.హెచ్.ఎస్.వి. ప్రసాదరావు సారథ్యంలో ప్రారంభించారు. ఈ చలివేంద్రం జూన్ 10వ తేదీ వరకూ కొనసాగనుంది. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మజ్జిగ పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

7న అల్లూరి వర్ధంతి కార్యక్రమాలు



మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య కె.సమత



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఏయూ క్యాంపస్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమాలు ఆంధ్ర విశ్వకళా పరిషత్, తెలుగు, సంగీత నృత్య శాఖల సంయుక్తంగా సమైక్య భారతి స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఈ నెల 7న నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఏయూ సంగీత విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెక్టార్ ఆచార్య కె.సమత ఈ మేరకు వివరాలు వెల్లడించారు. అల్లూరి తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అని అన్నారు. అటువంటి మహనీయుడిని స్మరించుకోవలసిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. బీచ్ రోడ్డులో 7వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీ పార్కు, దసపల్లా హిల్స్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులో స్వాతంత్ర్య సమరయోధుల మైదానంలో సంగీత నృత్య శాఖల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో విజయ నిర్మాణ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.విజయకుమార్, సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎ.అనురాధ, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.సరస్వతి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బూసి వెంకటస్వామి, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నక్కవానిపాలెంలో అక్రమ అంతస్తును కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో అనధికారికంగా నిర్మించిన భవనాలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేస్తున్నారు. నక్కవానిపాలెంలోని 3వ అంతస్తులో అక్రమంగా చేపట్టిన కట్టడాన్నిఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం తొలిగించారు. పలువురు చైన్‌మేన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'నాడు-నేడు' నిధుల లెక్క చెప్పండి

ఎన్‌ఎంసీహెచ్ స్కూల్ హెచ్‌ఎంను విచారించిన డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీ ఎన్‌ఎంసీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్‌ను బుధవారం నాడు-నేడు కార్యక్రమ పనులపై డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు విచారించారు. కలెక్టరేట్‌లో గత నెల 24న జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.మల్లికార్జునకు హెచ్‌ఎం రాంప్రసాద్‌పై ఫిర్యాదు చేస్తూ స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ రఘు వినతిపత్రం అందించారు. స్పందించిన కలెక్టర్.. దీనిపై విచారించాలని డీఈవో చంద్రకళకు ఆదేశించారు. ఆమె డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావును విచారణ అధికారిగా నియమించారు. బుధవారం ఉదయం పాఠశాలలో సుమారు ఎనిమిది ఫిర్యాదుల మేరకు డిప్యూటీ డీఈవో విచారణ చేపట్టారు. హైస్కూల్‌లో నాడు-నేడు పనులపై ఎంత బడ్జెట్ ఖర్చు చేశారో వివరాలు అడిగి సేకరించారు. ఈ ఏడాది స్కూల్ అభివృద్ధికి వచ్చిన నిధులను ఏ విధంగా ఖర్చు చేశారో బిల్లులు తీసుకురావాలని అధికారి ఆదేశించారు. స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులో హెచ్‌ఎంగా ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్‌కు గురైన హెచ్‌ఎంను మళ్లీ నియమించడంపై అభ్యంతరం తెలిపారు. ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లోని ప్లస్-2 గరల్స్ ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న బోటనీ లెక్చరర్ పోస్టును భర్తీ చేయాలని సూచించారు. స్కూల్‌కు వచ్చిన నిధులను సక్రమంగా ఉపయోగించడం లేదని, దీనిపై విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ మెంబర్ ఎం.ఇందర, రాజ్యలక్ష్మి, విచారణ అధికారులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం రాంప్రసాద్‌ను విచారిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

దాబాగార్డెన్స్: రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలోని అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు. కథలు.. కథనాలు.. సృజనాత్మక కళలతో శిబిరాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా 36వ వార్డు రంగిరీజు వీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు జరిగే సమ్మర్ క్యాంపులో పుస్తక పఠనం, సమీక్షలు, పెద్దల నుంచి విన్న ఆముద్రిత కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రంథాలయ పరిసరాల్లోని విద్యార్థులు ఈ వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలని బాలల శాఖ గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి కోరారు.

ఆస్పత్రులు పరిశీలించిన డీఎంహెచ్‌వో

పీఎం పాలెం: స్థానిక కీర్తన, వేదాంత ఆస్పత్రులను బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ రెండు ఆస్పత్రుల్లో అవసరమైన డాక్టర్లు, సిబ్బంది ఉన్నారని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందని ఆయన తెలిపారు. అనంతరం అక్కడి వైద్యులకు ఆయన కొన్ని సూచనలు చేశారు. పేద రోగులను దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని, రుసుములకు సంబంధించిన ధరల పట్టిక, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆస్పత్రి రిసెప్షన్‌లో ప్రదర్శించాలని సూచించారు.



వైద్యులతో మాట్లాడుతున్న జగదీశ్వరరావు

వెంకన్న సన్నిధిలో పండిత సదస్యం



సదస్యంలో పాల్గొన్న వేద పండితులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా జరిపారు. స్వామివారికి బాలభోగం, హోమాలు, అర్చన, నివేదన, మంగళాశాసనాలు చేపట్టారు. ఆలయ కల్యాణ మండపంలో పండిత సదస్యం నిర్వహించారు. వేద పండితులు గురునాథ్ శర్మ, శ్రీనివాసశర్మ, ఘనాపాఠీలు నాలుగు వేదాలు వల్లె వేశారు. వేద పఠనంతో బల్లిగిరి మార్మోగింది. వేంకటేశ్వరుని వైభవాన్ని వారు వివరించారు. అనంతరం ఆలయ ఈవో జీవీ రమాబాయ్ పండితులను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి పితాని వీధి, జీఎస్‌ఎం కాలనీ ఇళ్ల సమస్య

బీచ్ రోడ్డు: విశాఖ నగరానికి బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి జీవీఎంసీ 28వ వార్డులో పితాని వీధి, జీఎస్‌ఎం కాలనీ ఇళ్ల సమస్యను వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తీసుకెళ్లారు. ఈ మేరకు సీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఎం సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సీఎం సలహాదారు ధనుంజయరెడ్డికి, కలెక్టర్ మల్లికార్జునకు సూచించారు.



సీఎం జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న పల్లా దుర్గారావు, చిత్రంలో అక్కరమాని విజయనిర్మల

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో....



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, అనూష పట్నాయక్

బీచ్ రోడ్డు: భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు బుధవారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖ ఎయిర్ పోర్టులో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. అధినేతకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అలాగే రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ కూడా ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన



శిబిరానికి హాజరైన చిన్నారులు

ఎంవీపీ కాలనీ: సత్యసాయి సేవా సంస్థలు, బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోందని శిబిరం కో-ఆర్డినేటర్ మాధవి తెలిపారు. ఆరేళ్ల నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు విలువలు, సామాజిక సేవ, క్రమశిక్షణ పెంపొందించే లక్ష్యంతో ఈ శిబిరాలునిర్వహిస్తున్నామన్నారు. ఎంవీపీ కాలనీ, విశాలాక్షినగర్, నక్కవానిపాలెంలో సాయంత్రం 3.30 నుంచి 5.30 గంటల వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఎంవీపీ కాలనీ సత్యసాయి ప్రేమసదన్‌లో జరిగిన శిబిరానికి పెద్ద ఎత్తున చిన్నారులు హాజరై శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల సిటీ కన్వీనర్ డీవీవీ నాయుడు, బాల వికాస్ సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

పక్షుల సంరక్షణలో ఏయూ విద్యార్థులు



ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడంలో ప్రతి జీవి ప్రధానమేనని ఏయూ విద్యార్థులు నినదించారు. పక్షుల సంరక్షణకు ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు చొరవ చూపారు. బుధవారం విభాగ ప్రాంగణంలో ఉన్న వృక్షాల వద్ద పక్షులకు తాగునీరు, గింజలు అందుబాటులో ఉంచారు. పక్షుల పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థతో సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ పిచ్చుకలు, పక్షులకు నీరు, చిరుధాన్యాలు అందుబాటులో ఉంచాలని కోరారు. నగరంలో గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో 10,000 పిచ్చుక గూళ్లు, మంచినీరు ఆహారం కోసం 20,000 మట్టి పాత్రలు ఏర్పాటు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా విభాగం చుట్టూ ఉన్న ప్రాంతంలో పక్షుల కోసం గూళ్లు, నీటి పాత్రలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, సోషల్ వర్క్ విభాగం బోధన సిబ్బంది డాక్టర్ అబ్రహం, డాక్టర్ పుష్పాలత, పరిశోధకులు ఎస్.నారాయణస్వామి, రాంగోపాల్, సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు.



పక్షుల కోసం నీటి పాత్ర ఏర్పాటు చేస్తున్న విద్యార్థిని

రైల్వే గ్రౌండ్స్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం: రైల్వే గ్రౌండ్స్‌లోని వాకర్స్ పార్క్‌ను బుధవారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్క్‌ను మరింత సుందరంగా తయారుచేసి నగరంలోనే ఒక మోడల్ పార్క్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పార్క్‌ను ప్రధానంగా నగర పౌరులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు వాకింగ్ కోసం వినియోగిస్తున్నారు. పూర్తిగా పచ్చదనంతో, కూర్చునేందుకు అనువైన సదుపాయాలతో ఈ పార్క్‌ను తయారుచేశారు. పర్యటనలో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్.కె.సారంగి, సీనియర్ అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్, స్పోర్ట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వాకర్స్‌లో పార్క్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, రైల్వే అధికారులు